


# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూరు :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పిఏ సిఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పోల్కంపల్లి గ్రామంలో రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకొని సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మురళీమోహన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి పి.ఎ.సి.ఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఏవో ప్రియదర్శిని పిఎసిఎస్ సీఈవో విష్ణుమూర్తి, వైస్ చైర్మన్ బాలస్వామి, సింగల్ విండో డైరెక్టర్లు శంకర్ యాదవ్, నాయకులు, కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, సలేశ్వరం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.




# పుస్తక రచయితలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక, మన గ్రంథాలయం జ్ఞానోత్సవం కార్యక్రమాలలో భాగంగా జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక రచయితలకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య ఘనంగా సన్మానం చేశారు. శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ జి.సుకన్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడానికి పుస్తకాలు చదవడమే కాకుండా పుస్తక రచన ద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడాలని సూచించారు. విద్యా రంగానికి విశిష్ట సేవలు అందిస్తూ పుస్తకాలు రచించిన 17 మంది అధ్యాపకులకు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఒక చినిగిన చొక్కా అయినా వేసుకో గాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అనే సూక్తిని ప్రస్తావిస్తూ పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల గ్రంథాలయం అభివృద్ధికి ప్రతి అధ్యాపకుడు తమ వంతుగా పుస్తకాలను విరాళంగా అందించాలని ఆమె కోరారు. తదుపరి పత్రికా విలేకరులు, మీడియా ప్రతినిధులను కూడా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అలాగే ఉత్తమ పాఠక అధ్యాపకులు ఉత్తమ పాఠక విద్యార్థులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య, గ్రంథాలయ అధికారి ఆంజనేయులు, అధ్యాపకులు నర్మదా, శ్రీనివాసులు, రాఘవేంద్ర రెడ్డి, సులేమాన్, రుకియా భాను, వెంకటయ్య, నర్సింలు నరసింహారావు, పుష్పలత, ప్రవీణ్ కుమార్ సూరయ జబిన్, సతీష్ రెడ్డి, నాగలక్ష్మి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం బిఆర్ఎస్ 'పాదయాత్ర'

### డేట్ ఫిక్స్ చేయనున్న కెసిఆర్

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ పాదయాత్ర చేపట్టాలని ఉమ్మడి పాలమూరు జిల్లా బిఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది. శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ నివాసంలో జరిగిన ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఈమేరకు తీర్మానించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు త్వరలోనే ఈ పాదయాత్ర తేదీ, ప్రారంభ స్థలాన్ని ప్రకటిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. పాలమూరుపై కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోంది. నిరంజన్ రెడ్డి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన నిరంజన్ రెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు జిల్లా వ్యక్తి సీఎం అయితే ప్రాజెక్టు పనులు వేగవంతం అవుతాయని ప్రజలు ఆశిస్తే, ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును గాలికి వదిలేసింది. 70 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం, ఒక్కసారి కూడా ప్రాజెక్టు పై కేంద్రంతో మాట్లాడలేదు. కేసీఆర్ హయాంతోనే 5 రిజర్వాయర్లు, 4 పంప్ హౌస్ లు పూర్తి అయ్యాయి. మిగిలిన కొద్ది పాటి పనులను పూర్తి చేయకుండా, ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోంది. కనీసం ఒక్కనాడు కూడా ప్రాజెక్టు పై సమీక్ష నిర్వహించిన దాఖలాల లేవు.

**అశాస్త్రీయ నిర్ణాయాలు :** ప్రధాన ప్రాజెక్టు పూర్తి కాకుండానే, దాని పై ఆధారపడే దిండి వంటి ఇతర పనులకు రూ. 1800 కోట్లతో టెండర్లు పిలవడం విడ్డూరంగా ఉంది.

**రైతుల ఇబ్బందులు :** రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగినా, ప్రస్తుతం ప్రభుత్వం సరిగ్గా ధాన్యం కొనుగోలు చేయలేక రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ట్రాన్స్ పోర్ట్ టెండర్లు అనర్హులకు ఇవ్వడం వల్లే సేకరణలో సమస్య వస్తున్నాయి. పాలమూరు ప్రజల గొంతుకగా బిఆర్ఎస్ పార్టీ ఈ పాదయాత్ర ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, నవీన్ రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజన్న యాదవ్, అల వెంకటేశ్వర రెడ్డి, చిట్టెం రామ్ మోహన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్‌లో రూ.68.50 కోట్లతో 65 కిలోమీటర్ల మేర 19 రోడ్లు

### రాష్ట్ర పాడి, పశుసంవర్ధక మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/మక్తల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మక్తల్ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి వందల కోట్ల నిధులు తీసుకు వచ్చి, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామని రాష్ట్ర పాడి పశుసంవర్ధక, క్రీడా, డెయిరీ మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మంత్రి నివాసంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో భాగంగా వారు మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గంకు ఒక్క రోజులోనే 68.50 కోట్ల రూపాయలతో 65 కిలోమీటర్ల మేర 19 రోడ్లను మంజూరు చేసుకున్నామని మంత్రి తెలిపారు. భూత్పూర్ నుంచి క్రాటేపల్లి వరకు 3.5 కోట్లు, వనయకుంట, దాసర్ దొడ్డి లకు 5 కోట్లు, దండు నుంచి కేశవనగర్ వరకు 2.5 కోట్లు, అడవి సత్యారం నుంచి పెగడబండ వరకు 4 కోట్లు, అయినాపూర్ నుంచి సుకుమార్ లింగంపల్లి వరకు 4కోట్లు, పెద్ద పొర్ల నుంచి చిన్న పొర్ల వరకు 4కోట్లు, ఉట్కూరు మండలంలోని వల్లంపల్లికి 4కోట్లు, నాగిరెడ్డి పల్లి నుంచి ఉంద్యాల వరకు 3 కోట్లు, అమరచింత నుంచి మూలమళ్ల వరకు 2.5 కోట్లు, తిప్పడం పల్లి నుంచి అప్పరాల బ్రిడ్జి వరకు 2 కోట్లు, ముష్టిపల్లి నుంచి అనుగొండ వరకు 3 కోట్లు, సోమేశ్వర బండ నుంచి మల్లేపల్లి వరకు కోటి, అమ్మపల్లి నుంచి పర్మన్ దొడ్డి వరకు 3 కోట్లు, అడవి ఖానాపూర్‌కు 3 కోట్లు , లంకాల నుంచి ఉంద్యాల వరకు 7 కోట్లు, ధర్మాపూర్ నుంచి శాఖాపూర్ వరకు 4 కోట్లు, దమగ్నపూర్ మీదుగా చిత్తనూర్ వరకు 4 కోట్లు మొత్తం 19 రోడ్లు.. 68 కోట్ల 50 లక్షల రూపాయలతో మంజూరు చేసుకున్నామని, ఇది ఒక రికార్డు అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దీంతో పాటు ఇప్పటికే ఆత్మకూరు గద్వాల మధ్య బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కొత్తగా కొల్పూర్ కొర్తికుండ వద్ద మినీ జురాల డ్యామ్ కమ్ బ్రిడ్జి దాదాను 800 కోట్లతో కర్నాటక తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టుగా అతి త్వరలో పట్టాలెక్కనుందని చెప్పారు. హిందూపూర్ వద్ద థర్మల్ పవర్ స్టేషన్‌కు సైతం త్వరలో గ్రీన్ సిగ్నల్ రానుందని చెప్పారు. ఇక ఉమ్మడి రాష్ట్రంలో వెటర్నరీ ట్రెయినింగ్ సెంటర్ అనంతపురంలో ఉండేదని, తెలంగాణలో లేకపోవడంతో.. సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి, మక్తల్‌కు రాష్ట్రస్థాయి వెటర్నరీ ట్రెయినింగ్ సెంటర్‌ను గోలపల్లి శివారులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మినీ స్టేడియం, డిగ్రీ కాలేజ్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సైతం శాశ్వత భవనాలు మంజూరు చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, కట్టా సురేష్ గుప్తా, రవికుమార్, గాయత్రి, అనిల్, రాజప్ప గౌడ్, చెన్నయ్య సాగర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/మక్తల్ :** మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు స్థానిక ఎమ్మెల్యే మంత్రి డా.వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గూడు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు.

గొల్లపల్లి గ్రామంలో మొదటి ప్రాధాన్యతగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి డా.వాకిటి శ్రీహరి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని 50 ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అందులో ఒకేరోజు 7 ఇళ్ల గృహప్రవేశాలు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

30 ఇళ్లు ప్రగతిలో ఉన్నాయని, అవి కూడా ఈ నెలరోజుల్లో పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని ఆమె లబ్ధిదారులకు సూచించారు. 50 ఇళ్లు పూర్తి అయితే రెండవ విడత మరికొన్ని ఇళ్లు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 4వేలకు పైగా ఇళ్లను కేటాయించడం జరిగిందని త్వరలో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు సూర్యకుమార్, కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, బి.గణేష్ కుమార్, రాజేందర్, పాల కృష్ణ, ఓబులేసు , పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై మెరుపు దాడి

**ప్రజాపక్షం/నర్వ :** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టుకొని పేకాట అడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, నర్వ పోలీసులు సంయుక్తంగా జూదారుల స్థావరం పై దాడి నిర్వహించిన పేకాట ఆడుతున్న 16 మంది వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నగదు రూ. 1,13,200, 52 పేకాట కార్డులు, 15 మోటార్ సైకిళ్లు, 18 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని 16 మంది వ్యక్తుల పై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని నర్వ ఎస్సై పబ్బతి రమేష్ తెలిపారు.

# వరికి క్వింటాల్‌కు రూ.3,243 ఇవ్వాల్సిందే

### తెలంగాణ రైతాంగ సమితి డిమాండ్




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు రైతుల కళ్లలో మట్టి కొట్టేలా ఉన్నాయని, ఎం.ఎస్.స్వామి నాదన్ కమిటీ సిఫారసుల ప్రకారం మద్దతు ధరలను అమలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండు చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అరకొర పెంపుతో మోసం కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరలు పెంచి ఆదాయం రెట్టింపు చేశామని గొప్పలు చెప్పుకోంటోందని, కానీ క్షేత్రస్థాయిలో పెరిగిన పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ధరలు లేవని వారు విమర్శించారు. సమర్థంగా ఉత్పత్తి ఖర్చులను లెక్కగట్టి సి 2+50/% సూత్రం ప్రకారం ధరలు నిర్ణయించకుండా కేంద్రం ఇష్టానుసారంగా ధరలను ప్రకటించిందని ఆరోపించారు. లెక్కల ప్రకారం రైతుకు భారీ నష్టం తెలంగాణలో ప్రధాన పంటలైన వరి, పత్తి రైతులకు కేంద్రం మొండిచేయి చూపిందని నాయకులు పేర్కొన్నారు. వరి స్వామినాదన్ సిఫారసుల ప్రకారం క్వింటాల్‌కు రూ.3,243 ఇవ్వాలి. కానీ కేంద్రం కేవలం రూ.72 మాత్రమే పెంచి రూ.2,461 గా నిర్ణయించింది. దీని వల్ల వరి రైతు క్వింటాల్‌కు రూ.782 నష్టపోతున్నాడు. పత్తి , మొక్కజొన్న పత్తికి 557, మొక్కజొన్న కు కేవలం రూ10 మాత్రమే పెంచడం రైతులకు అవమానించడమేనని మండిపడ్డారు. పెరుగుతున్న పెట్టుబడి భారంః పశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, తద్వారా దేశంలో పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీల పెరుగుదల వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు ఖర్చులు భారమై, అప్పులు తీర్చలేక దేశవ్యాప్తంగా రోజుకు సగటున 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గణాంకాలను వివరించారు.

**ఉద్యమమే శరణ్యం :** రైతాంగానికి జరుగుతున్న అన్యాయంపై అన్ని వర్గాల ప్రజలు ఏకమై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. స్వామినాదన్ సిఫారసులు అమలయ్యే వరకు విశ్రమించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు గోపాల్, లక్ష్మి నారాయణ, నర్సింహ తదితరులు ఉన్నారు.

# ప్రజా పోరాటాలకు ఊపిరులూదిన ప్రజానాట్యమండలి

### తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** దేశ స్వాతంత్ర్యం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలకు ప్రజా పోరాటాలకు ప్రజలను చైతన్యం చేసి ముందుకు నడిపించిన ఘన చరిత్ర ప్రజానాట్య మండలి సొంతమని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రం సిపిఐ ఆఫీస్ వద్ద ప్రజానాట్యమండలి 4వ జిల్లా మహాసభ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజానాట్యం మండలి జిల్లా అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. 1743 లో ప్రజానాట్య మండలి ఏర్పడిందని దేశ స్వాతంత్రం కోసం ఆటపాటతో ప్రజల్లో స్వాతంత్ర ఆకాంక్షను రగిలించి, పోరాటాల్లోకి నడిపించిందన్నారు. ' బాంచన్ నీ కాల్మొక్త దొర ' అని వెట్టి చేసి జీవిస్తున్న తెలంగాణ ప్రజల విముక్తికి ఆటపాటతో ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యం చేసి నిజాం పాలనను కూల్చిందన్నారు. ఆనాడు కవులు కళాకారులు ఒక చేత పెన్ను ఒక చేత గన్ను పట్టుకొని పోరాడారన్నారు. తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో ప్రజానాట్యమండలి కవులు కళాకారులు ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం రగించారన్నారు. ధూమ్ దాం పేరుతో ఊరువాడ ప్రతిధ్వనించిందన్నారు. ప్రజల సమస్యల పై జరిగిన పోరాటాల్లోను ప్రజానాట్యమండలి కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఎర్రజెండా బిడ్డలుగా ప్రజానాట్యమండలిని ప్రజల కోసం బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పార్టీ ఉన్న ప్రతి గ్రామంలో ప్రజానాట్యమండలి కళాకారులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు యువతను ఆకర్షించేందుకు కళాశాలల్లో పాఠశాలలను పాటల పోటీలు కవితల పోటీలు పెట్టాలన్నారు. వారికి ప్రజా విద్యార్థుల సమస్యలను వివరించి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఐదో మహాసభ నాటికి జిల్లా ప్రజానాట్యమండలిని బలోపేతం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు వంకా గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు కళావతమ్మ, విజయుడు, శ్రీరామ్, రవీందర్, జయమ్మ, శ్యామ్ సుందర్, శిరీష, కుతుబు, వెంకటేష్, చందు, లక్ష్మీనారాయణ, ఇజ్రాయిల్, కుమార్, రూప తదితరులు పాల్గొన్నారు.



# విద్యా వారోత్సవాల్లో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

### గ్రంథాలయాలు - జ్ఞానానికి హృదయం అంశంపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాలు జ్ఞానానికి హృదయం అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ శివ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞానికి నిలయాలని, పుస్తకాల ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు కళాశాల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ ఎం.పార్వతమ్మ, ఉపసర్పంచు ఎం.బాలాపీరు, మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, నరసింహారెడ్డి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందుతుందని, చదువు జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ ప్రపంచంలో రాణించాలని సూచించారు. అధ్యాపకులు కూడా గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వివరణాత్మకంగా మాట్లాడారు. సంప్రదాయ గ్రంథాలయాలతో పాటు డిజిటల్ లైబ్రరీల వినియోగం పెరుగుతోందని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పఠన అలవాట్లు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. విద్యార్థులు రోజువారీగా పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని సూచించారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు కళాశాల అధ్యాపక బృందాన్ని ఘనంగా సన్మానించారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

### లైబ్రరీ డేలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** గ్రంథాలయంలోని పత్రికలు, పుస్తకాలను పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు చదివి సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో శుక్రవారం లైబ్రరీ డే సందర్భంగా గద్వాలలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. లైబ్రరీలో వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమైన అప్డేట్ పుస్తకాలను తెప్పిస్తామన్నారు. విద్యార్థుల ఒక కమిటీగా ఏర్పడి తమకు కావాల్సిన పుస్తకాల లిస్ట్ రాసి ఇవ్వాలన్నారు. గ్రూప్స్, బ్యాంకింగ్, టీచర్, తదితర ఉద్యోగాలకు సాధన చేస్తున్న నిరుద్యోగులు పక్కా ప్రణాళికతో లక్ష్యాలను అనుగుణంగా చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారన్నారు. ఒకే నోటిఫికేషన్ కోసం కాకుండా నిరుద్యోగులు తాము చదివిన కోర్సులకు రిలేటెడ్ గా ఉండే ఇతర ఉద్యోగాల కోసం కూడా సాధన చెస్తే ప్రయోజనం ఉంటుందని సూచించారు.

గ్రంథాలయ పక్కా భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సమీపంలో ఉన్న పాత కోర్టు భవనంలోకి మార్చడానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతన భవన నిర్మానానికి ప్రస్తుతం ఉన్న నిధులేకాక ఎంపి నిధులతో పాటు కలెక్టర్ నిధులను మంజూరు చేస్తామన్నారు. టాయిలెట్స్, ఫాన్లు, లైట్లు, కంప్యూటర్స్ అప్డేట్, ఇంటర్నెట్, ఇన్వర్టర్, తదితర సమస్యలను పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చినందున పరిష్కరిస్తామన్నారు. మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండడంతో అందుబాటులో ఉన్న నిధులతో త్వరలోనే నిర్మిస్తామన్నారు. గ్రంథాలయంకు వచ్చే పాఠకులు తప్పనిసరిగా రిజిస్టర్లో సంతకాలు పెట్టాలని, లైబ్రరీ మెంబర్షిప్ కార్డును తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయంలోని వివిధ సమస్యల పై కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ గ్రంథాలయ పరిసరాలనపు పరిశీలించి మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్కావెంబర్ ను నియమిస్తామన్నారు.

సమీపంలోని నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డీఈవో విజయలక్ష్మి, లైబ్రేరియన్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండల సిపిఐ కేంద్రాల్లో నిరసనలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శనివారం జిల్లాలోని మండల కేంద్రాలలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం శుక్రవారం ఆరు గంటలకి ప్రజలందరినీ మోసం చేస్తూ డీజిల్‌పై మూడు రూపాయలు ధరలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమై డీజిల్ పెట్రోల్ ధరలు అడ్డు అదుపు లేకుండా పెరిగి అది సరిపోదు అన్నట్టుగా విపరీతమైన గత రెండు నెలలుగా ఏర్పడ్డ కొరత ఇవన్నీ కాదన్నట్టు మళ్ళీ ఆరోజు పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయలు పెంచడం అనేది కేంద్ర ప్రభుత్వం చేతగానితనానికి సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులతో సమితి పిలుపులో భాగంగా శనివారం ఉదయం అన్ని మండల కేంద్రాల్లో ఈ ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పార్టీ పిలుపునిస్తోంది రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయా మండలాల కార్యదర్శులు పార్టీ కౌన్సిల్ మెంబర్లు ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు.

# ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత

## ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : దోమల నివారణ చర్యలను మరింత వేగవంతం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంతోష్ నగర్ కాలనీ, గోపాల్ రెడ్డి నగర్, ఆదర్శ్ నగర్ కాలనీ, దమ్మాయిగూడ ప్రాంతాల్లో ఆయన ఫీల్డ్ ఇన్స్పెక్షన్లు నిర్వహించారు. డిసిలు, డిఇలు, రాంకీ ప్రతినిధులు, ఎంటమలాజి సిబ్బందితో కలిసి దోమల లార్వా పెరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్, యాంటీలార్వల్, పారిశుద్ధ్య పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. కొన్నిప్రాంతాలకు వెళ్లే మార్గాలు మూసుకుపోయినట్లు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కమిషనర్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆదర్శ్ నగర్ కాలనీ, దమ్మాయిగూడ ప్రాంతాల్లో జరుగుతున్న జనగణన కార్యక్రమాలను సమీక్షించి, ఎన్యూమరేటర్ సిబ్బంది హాజరు, ఫీల్డ్ డ్యూటీలపై అధికారులను ప్రశ్నించారు. జనగణన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

### బాధ్యతయుతంగా పనిచేయాలి

క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయంలో ఎస్‌ఎఫ్ఏ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. నగర పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇంటింటికీ సేవల అనుసంధానం పూర్తి చేసి, మిగిలిన గ్యాప్లను తక్షణమే భర్తీ చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. స్వీపర్ల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కువకాలం గైర్హాజరు అయ్యే సిబ్బందికి ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఫీల్డ్ స్థాయి పనితీరు, పెండింగ్ సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి : రామరాజేష్‌ఖన్నా



ప్రజాపక్షం/హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న నాలుగో తరగతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఓ నెంబర్ 60 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం రూ.10 వేలు మాత్రమే ఇస్తూ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. 2011 నుంచి ఇప్పటి వరకు వేతన సవరణ జరగలేదని, వెంటనే వేతనాల సవరణ చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాకాల మల్లేశం, ఝాన్సీ, సునీత, లావణ్య, విజయ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన రైతులకు న్యాయం చేయాలి

## రాష్ట్ర రైతు వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



ప్రజాపక్షం/యాచారం : మొండిగౌరేల్లి గ్రామంలో అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర రైతు వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. మొండిగౌరేల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కోదండారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించగా శుక్రవారం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి ఆర్‌డిఓ, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో కోదండరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ మొండిగౌరేల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసేకరణ విషయంలో ఎలాంటి అక్రమాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ అనంతరెడ్డి, తహశీల్దారు అయ్యప్ప తదితరులు పాల్గొన్నా

# పంట మార్పిడితో అధిక దిగుబడులు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పంటల మార్పిడితోనే అధిక దిగుబడులు వచ్చే అస్కారం ఉంటుందని, ఆ దిశగా అన్నదాతలు కృషి చేయాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్ రాజు, డాక్టర్ భారతిలు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ బాబునాయక్, ఉపసర్పంచ్ వెంకటేష్ యదవ్, వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్, ఎఈఓలు గోవర్ధన్, తేజ్‌కుమార్, కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఫరూక్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ గ్రేడ్..1శాఖ గ్రంథాలయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ లక్ష్మీ నర్సింహ్మారెడ్డి 300పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ఎంఇఓ మనోహర్ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు నక్క బాల్‌రాజ్ యాదవ్, సి.వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యాసెట్ శ్రీనివాస్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, కత్తి చంద్రశేఖర్ అప్ప, డైరెక్టర్లు ర్యాకల శ్రీకాంత్ ముదిరాజ్, కాట్నా రాజేష్, చీపిరి శివరాములు యాదవ్, రవినాయక్, అనిత్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



ప్రజాపక్షం/కేశంపేట: ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచేందుకు కూలీలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిదిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులు పరిశీలించారు. బైర్‌ఖాన్‌పల్లి గ్రామంలోని ఫార్మేషన్ రోడ్డు, కొత్తపేటలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకు, బోదునంపల్లిలోని మైనర్ ఇరుగేషన్ ట్యాంకు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొన్ని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# శ్రీరామ్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : శ్రీరామ్ నగర్ కాలనీ అభివృద్ధి కోసం తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాజీ కార్పొరేటర్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వారికి వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము గౌడ్, కోశాధికారి శేఖర్, గౌరవ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పుష్పాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, దయానంద్ గౌడ్, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

## టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. మీడియాతో మాట్లాడిన ఆమె పలు రాజకీయ, సామాజిక అంశాలపై స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆర్ఎస్ఎస్ సిఎంగా అభివర్ణించిన కవిత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధానికి లేఖ రాస్తానని తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో వ్యక్తిగత విభేదాలు లేవని, ఉద్యమ నాయకుడిగా ఆయన గొప్పవారని కవిత అన్నారు. అయితే పార్టీ వ్యవహారాలపై తాను చెప్పిన అభిప్రాయాలను బయటకు వచ్చేలా చేశారని ఆరోపించారు. ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం వంటి అంశాలను తమ పార్టీ ప్రధాన అజెండాగా తీసుకెళ్తామని, రైతులు, మహిళలు, యువత, వికలాంగులు, మాజీ సైనికులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

# ప్రతీ ఓటరు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు

## జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) చంద్రకళ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎస్ఐఆర్‌లో ప్రక్రియలో భాగంగా 66 చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రీఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. చార్మినార్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి అదనపు కమిషనర్ (ఎన్నికలు) చంద్రకళ హాజరయ్యారు. సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఎఇఆర్ఓలు), సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) పాల్గొన్నారు. ఎన్నికల డేటా ఖచ్చితత్వం, క్షేత్రస్థాయి ధృవీకరణ, ఓటరు వివరాల నవీకరణ, బూత్ స్థాయి పర్యవేక్షణ బలోపేతంపై చర్చించారు. ఎస్ఐఆర్‌లో ప్రక్రియలో ప్రతి ఓటరు సక్రమంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రకళ అధికారులను ఆదేశించారు.

### రేబీస్ నివారణకు జిహెచ్‌ఎంసి అవగాహన కార్యక్రమాలు

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పశు వైద్య ప్రజారోగ్య కార్యకలాపాలు అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కుక్క కాట్లు, రేబీస్ వ్యాధి నివారణ, పెంపుడు జంతువుల బాధ్యతాయుత సంరక్షణ, జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం వంటి అంశాలపై విద్యార్థులు, పౌరులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పశు వైద్య బృందాలు పాల్గొన్నాయి. మీర్‌పేట్, యుపిహెచ్‌సి, విపిజి గోషామహల్, గౌలిపుర, ఇమ్రానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలకు మంచి స్పందన లభించిందని అధికారులు తెలిపారు. వీధి కుక్కల జనాభా నియంత్రణలో భాగంగా 82 కుక్కలకు స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలు నిర్వహించగా, రేబీస్ నివారణ కోసం 405 యాంటీరేబీస్ వ్యాక్సిన్లు అందించారు. ప్రజారోగ్యం, జంతు సంక్షేమ పరిరక్షణలో భాగంగా అవగాహన, నివారణ చర్యలను కొనసాగిస్తామని జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు.

# పశువుల అక్రమ రవాణా నిరోధానికి గట్టి నిఘా

## అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



ప్రజాపక్షం/రంగారెడ్డి: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సంబందిత అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధం పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడం పై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను తరలించడానికి తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలన్నారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్ రెడ్డి, సరిత, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఒత్తిడి, ఒంటరితనం, వ్యసనాలపై అవగాహన



## సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్

ప్రజాపక్షం/రంగారెడ్డి: యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఒంటరితనం, వ్యసనాలను ఎదుర్కోవడానికి అవగాహన, బహిరంగ చర్చలు జరగాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ అన్నారు. శుక్రవారం సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన, బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో "సురక్ష కవచ్ కాలేజ్ సేఫ్టీ అండ్ వెల్‌బీయింగ్ హ్యాండ్‌బుక్"ను సిపి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పోలీస్‌ఉన్నతాధికారులు, విద్యా రంగ నిపుణులు, మానసిక ఆరోగ్య నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని, విద్యాసంస్థల్లో సురక్షితమైన వాతావరణం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల నేతృత్వంలో క్లబ్‌ల ద్వారా వారిని సాధికారులను చేయడం కార్యక్రమ ఉద్దేశ్యం అన్నారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థి శ్రీవర్, నటుడు, దర్శకుడు, రచయిత రాహుల్ రవీంద్రన్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫసర్ బాలకృష్ణారెడ్డి, ఎస్‌సి ఎస్‌సి ప్రతినిధులు వనితా దాట్ల, చేతనా కాసం, శ్రీవిద్యరెడ్డి, ఎస్‌సి ఎస్‌సి డైరెక్టర్ రష్మీ శ్రీవాస్త పాల్గొన్నారు.

# బయటి వ్యక్తుల వివరాలు నమోదు

## చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్



ప్రజాపక్షం/శంకర్‌పల్లి: కమ్యూనిటీలలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని, వాహనం వివరాలను విజిటర్ మేనేజ్మెంట్ రిజిస్టర్, డిజిటల్ ఎంట్రీ సిస్టంలోకి తప్పనిసరిగా నమోదు చేయాలని చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీలను చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ సందర్శించారు. ఆయా గేటెడ్ కమ్యూనిటీలలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాల పనితీరును, అందుబాటులో ఉన్న భద్రత వ్యవస్థలను ఎంట్రీ, ఎగ్జిట్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు,ఇతర సిబ్బందిని పారాసాలో నమోదు అయిన సెక్యూరిటీ ఏజెన్సీల నుండి మాత్రమే సెక్యూరిటీ గార్డులను మాత్రమే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు.

# ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలి

## సంబంధిత అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/రంగారెడ్డి: కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతి న తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రి య సమర్థవంతంగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలుపై సంబంధి త అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం తరలింపుకు అవసరమైన లారీల ను సమకూర్చుకోవాలని, రైస్‌మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులను, టార్పలిన్ లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు.తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# పెట్రో ధరలు పెంపు మోదీ ప్రభుత్వానికి సిగ్గుచేటు

## ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : దేశంలో గత ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడం దేశ ప్రజలను అవమానం పర్చడమేనని, వారిపై పెనుభారం మోపుతున్న మోదీ ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోల్ ధరలు పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలకు పెనుభారం పడుతుందన్నారు. ఈధరలతో పేద, మధ్యతరగతి ప్రజలపై మరింతా భారం పడడంతో వారి జీవన విధానంపై ముప్పు వచ్చే విధంగా మోదీ వ్యవహరించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, భవాని కుమార్, తిరుమల్‌రెడ్డి డివిజన్ అధ్యక్షులు అందోజు సత్యం చారి, చింతల రవికుమార్ గుప్తా, చీరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్, డిజీల్ ధరలు పెంపును ఉపసంరించుకోవాలి



ఇబ్రహీంపట్నం : కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్ ధరలను పెంపును తక్షణమే ఉపసంరించుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డిజీల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపటానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గత యుపిఎ ప్రభుత్వంలో పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని విమర్శించారు. దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్ ధరలను పెంచటం సిగ్గుచేటన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వ పాలన సామాన్య ప్రజల పాలిట పెనుశాపంగా మారిందని విమర్శించారు. ఇంధనం ధరలు పెంచాలనే నిర్ణయాన్ని ఉపసంరించక పోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో

## మరింత సమర్థవంతంగా క్యాన్సర్ చికిత్స

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు 'క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ' నివేదికను సిఎంకు అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ, ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్థూ పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తిపై సమగ్ర అధ్యయనంతో రూపొందించిన నివేదికను అందజేసిన నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. క్యాన్సర్‌పై పోరాటంలో ఈ అట్లాస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను విశ్లేషించేందుకు ఈ నివేదిక దోహదపడుతుందని సిఎం తెలిపారు. నివేదికలో పొందుపరిచిన డేటా ఆధారంగా క్యాన్సర్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం స్పష్టం చేశారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ బిఆర్‌కె భవన్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధి బృందం కలిసింది. రాష్ట్రంలో చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తమ ఆందోళనలు, సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించింది. ఈ భేటీలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, నవీన్ యాదవ్, శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల అధికారిని కోరారు. ముఖ్యంగా ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎన్నికల సంఘం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ ఎస్ఐఆర్ ప్రక్రియను హడావుడిగా చేపట్టాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఈ ప్రక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రక్రియతో పాటు ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ఓటు తొలగింపుల విషయంలో ప్రజలకు తగిన అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటు తొలగించినట్లయితే తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు కనీసం మూడు నెలల గడువు ఇవ్వాలని, బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) మూడు నుంచి నాలుగు సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యక్ష ధృవీకరణ చేపట్టాలని కోరారు. విదేశాల్లో ఉన్నారనే కారణంతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని, పౌరసత్వ ధ్రువీకరణ పేరుతో ఇబ్బందులు పెట్టకూడదని సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరి ఓట్లను వారే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి అని ఆయన కోరారు.

## వేగవంతంగా హరిత నిధి ప్రాజెక్టు పూర్తి

మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: హరిత నిధి ప్రాజెక్టులకు వేగవంతంగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హరిత నిధి 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గతంలో మంజూరైన ప్రాజెక్టుల అమలు పురోగతిని మంత్రి సమీక్షించగా, పలు కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. నర్సరీల ఏర్పాటు, అర్బన్ పార్కుల అభివృద్ధి, అటవీ సంరక్షణ, అటవీ పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, ఎకోటూరిజం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు హరిత నిధి కీలక వేదికగా పనిచేస్తోందన్నారు. అడవుల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ప్రాజెక్టు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో పాటు కొత్తగా మంజూరైన ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేసి, పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. అటవీ సంపదను కాపాడడం, జీవ వైవిధ్య పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి హరిత నిధి లక్ష్యాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు శాశ్వత ఉత్తర్వులు

ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు ఏటా ఇచ్చే పునరుద్ధరణ ఉత్తర్వులకు బదులుగా శాశ్వత ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర టీచర్స్ యూనియన్, తెలంగాణ స్టేట్(ఎస్‌టియు, టిఎస్) అధ్యక్షులు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుత్తు గజేందర్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సదానందం గౌడ్, గజేందర్‌లు శాఖలు, విభాగాల వారీగా సమస్యలను ఎస్‌టియు, టిఎస్ పక్షాన వివరించారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని రామకృష్ణా రావుకు అందచేశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్, గజేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి హామీ మేరకు ప్రతి రెండు నెలలకు ఒకసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు 'అదర్ డ్యూటీ' (ఓడి) సదుపాయాన్ని తక్షణమే కల్పించాలన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (2018) ప్రకారం ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలని సూచించారు. ఖాళీగా ఉన్న ఎంఇఓ, డిప్యూటి డిఇఓ, డిఇఓ, డైట్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. 1.8.2026 కటాఫ్ తేదీతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలల కోసం 10,000 ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. జి.ఓ 317 సమస్యలను పూర్తిగా పరిష్కరించి, భార్యాభర్తల బదిలీలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. తమిళనాడు తరహాలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం 2026లో మూడుసార్లు స్పెషల్ టెట్ (టెట్ ) పరీక్షలను నిర్వహించాలన్నారు. 01.07.2023 నుండి అమల్లోకి వచ్చేలా 51 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ఒకేసారి చెల్లించాలని కోరారు. డిఎస్‌సి 2008 ఉపాధ్యాయులకు 12 నెలల పూర్తి జీతం చెల్లించాలన్నారు. కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) జూన్ 1, 2026 నుండి తక్షణమే అమలు చేయాలన్నారు. మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ రెసిడెన్షియల్, సమగ్ర శిక్షా సిబ్బందికి కూడా హెల్త్ కార్డ్ సౌకర్యం కల్పించాలన్నారు. హెల్త్ కేర్ ట్రస్టో ఎస్‌టియు ప్రతినిధులకు చోటు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని సదానందం గౌడ్, గజేందర్‌లు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

## పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ల ఉత్పత్తి

ఎపి సిఎం చంద్రబాబు ఉద్ఘాటన
రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో కలిసి ఆమ్కా సహా కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన



శ్రీ సత్యసాయి/పుట్టపర్తి : రాయలసీమ దేశానికే రక్షణ సీమగా నిలిచేలా అడుగులు పడ్డాయి. రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ఐదో తరం యుద్ధ విమానాల తయారీకి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి వేదికైంది. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎంసీఏఆమ్కా) ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి చంద్రబాబు శంకుస్థాపన గావించారు. అమ్కా ప్రాజెక్టుతో పాటు త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ అధ్వర్యంలోని ఆగ్నేయా ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలకు కూడా వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... పుట్టపర్తి అనగానే సత్యసాయి బాబా గుర్తొస్తారని తెలిపారు. సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారని గుర్తు చేశారు. పుట్టపర్తి అంటే దేశం గర్వించే రక్షణ కేంద్రంగా తయారవుతుందన్నారు. పుట్టపర్తిలో అమ్కా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం గర్వకారణంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో పుట్టపర్తిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలియజేశారు. అలాగే కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఆమ్కా లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. 'రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగాం. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయని తెలిపారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నామని తెలిపారు. సీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్థంగా వినియోగించుకుంటామని, కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారనుందన్నారు. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుందని, తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేశ్ ఆ సమస్యను పరిష్కరించారని సీఎం వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో గూడులేని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోందన్నారు. హైదరాబాద్ హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్, ఫారెస్టు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ తొలి విడతలో మూడు లక్షలకుపైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, అందులో సుమారు 2.90 లక్షల ఇండ్లకు గ్రౌండింగ్ పూర్తయిందన్నారు. ఇప్పటికే దాదాపు 50 వేల గృహ ప్రవేశాలు జరిగాయని, మరో రెండు లక్షలకు పైగా ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో వీటి నిర్మాణం పూర్తయ్యే అవకాశముందని చెప్పారు. ఐటిడిఏ ప్రాంతాలకు అదనంగా ఇండ్లు కేటాయించామని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని జూన్ 2న ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభిస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందే వరకు మూడో, నాలుగో విడతలుగా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం కింద రూ.20 వేల వరకు సహాయం పొందిన వారికి కూడా కొత్తగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో 600 చదరపు అడుగులకు పైగా నిర్మించిన ఇళ్ల బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలు తమ గుడిసెల స్థానంలో ఇల్లు నిర్మించుకునే సమయంలో ఫారెస్ట్ అధికారులు లేదా సింగరేణి యాజమాన్యం అడ్డంకులు కల్పించవద్దని మంత్రి సూచించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టిని చెరువులు, కుంటల నుంచి తరలించడంపై రెవెన్యూ, పోలీసు శాఖలు ఇబ్బందులు కలిగించవద్దని కలెక్టర్లకు ఆదేశించారు. రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అటవీ భూములపై రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య సరిహద్దు వివాదాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రెండు శాఖలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్‌తో భూ సర్వే నిర్వహించి వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా నిర్మాణ దశలో ఉన్న 2 బిహెచ్‌కె ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పారదర్శకంగా అర్హులైన పేదలకే ఇళ్ల కేటాయింపు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల

## బలోపేతానికి మరిన్ని చర్యలు : సిఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పిఎసిఎస్) మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర సహకార శాఖ, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార ఉద్యమం బలంగా ఉందని, సమగ్ర ఆర్థిక అభివృద్ధికి విశేషంగా దోహదపడే సామర్థ్యం గలదని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య రంగాల్లో సహకార వ్యవస్థ విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, త ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి , ఆదాయ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన అన్నారు. సహకార సంస్థలను మరింత పోటీ సామర్థ్యంతో, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లేందుకు సామర్థ్యవృద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడంలో, గ్రామీణ స్థాయిలో ఆర్థిక సాధికారత కల్పించడంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సహకార రంగంపై సమగ్రంగా వివరించారు. గ్రామీణ సామాజికఆర్థిక అభివృద్ధిలో సహకార సంస్థలు పోషిస్తున్న కీలక పాత్రను ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సిద్ధార్థ్ జైన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ''ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజులు''

మే 18 -23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు తెలంగాణ వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బ్రోషర్‌ను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 18న హైదరాబాద్‌లోని స్టేట్ మ్యూజియంలో మంత్రి జూపల్లి ఈ పర్యాటక వారోత్సవాలను మధ్యాహ్నం ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపద, సంస్కృతి, ఎకోటూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

**23న హైదరాబాద్‌లో 'డెస్టినేషన్ తెలంగాణ..**

స్ట్రాటజీస్ ఫర్ ది నెకట్స్ ఫ్రంటియర్ ఆఫ్ టూరిజం' అనే ఇతివృత్తంతో 'పర్యాటక సదస్సు 2026' నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సదస్సులో పర్యాటక రంగ భాగస్వాములు, హాస్పిటాలిటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొని తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్తు వ్యూహాలపై చర్చించనున్నారని వివరించారు.

## గ్లోబల్ ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతున్నాం

మంత్రి శ్రీధర్ బాబు




ప్రజాపక్షం/హైదరాబాద్: ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ దేశవ్యాప్తంగా కీలక శక్తిగా ఎదుగుతోందని, రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలను అనుసంధానం చేస్తూ గ్లోబల్ సప్లై చైన్‌లో తెలంగాణను కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని ఐటిసి కాకతీయలో శుక్రవారం నిర్వహించిన 48వ ఇఇపిసి ఇండియా సదరన్ రీజియన్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌పోర్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర పారిశ్రామిక పురోగతి, ఎగుమతుల విస్తరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఇంజనీరింగ్ ఎగుమతులు రికార్డు స్థాయిలో 116.67 బిలియన్ డాలర్లకు చేరాయని, ఇది దేశ మొత్తం మర్చండైజ్ ఎగుమతుల్లో 27 శాతంగా ఉండటం ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమన్నారు. ఈ వృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఈవీ మొబిలిటీ రంగాల్లో తెలంగాణ జాతీయ స్థాయిలో వేగంగా ఎదుగుతోందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఇంజనీరింగ్ ఎగుమతులు 7.5 బిలియన్ డాలర్లకు చేరుకోవడం తెలంగాణ పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండస్ట్రియల్ పార్కులు, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్కిల్లింగ్ ఎకోసిస్టమ్, ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ వేర్వేరు రంగాలుగా భావించేవారని, ఇప్పుడు ఈ రెండింటి సమన్వయంతోనే ప్రపంచ మార్కెట్లో పోటీ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ఏఐ, ఆటోమేషన్, రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఎగుమతి రంగానికి అవసరమైన రెడీ టు వర్క్ ఫోర్స్‌ను తయారుచేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చిన మంత్రి, హైదరాబాద్‌లో ఈఈపీసీ ప్రాంతీయ కార్యాలయాన్ని పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీవీఆర్ సుబ్రహ్మణ్యం,ఇఇపిసి ఇండియా ప్రతినిధులు పంకజ్ చాడ, రామన్ రఘు, శశి లూయిస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమంలో విప్లవం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అడవుల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దాకా గిరిజన సమాజాన్ని అభివృద్ధి శిఖరాలకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధిలో ఎఐ పాత్ర పై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రిమాట్లాడుతూసిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగపరిచే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. 'నూతన ఆవిష్కరణల ద్వారా సమ్మిళిత వృద్ధి ' ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు గిరిజన సంక్షేమంలో భాగం చేస్తూ కొత్త తెలంగాణ నిర్మాణానికి బాటలు వేస్తున్నామని తెలిపారు.గిరిజన విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేందుకు ఎఐ ఆధారిత విద్యా వ్యవస్థను ప్రవేశపెడుతున్నామని మంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్చువల్ టీచర్లు, డిజిటల్ ట్యూటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. దూర ప్రాంత గిరిజన గ్రామాలకు ఎఐఆధారిత టెలీమెడిసిన్ సేవలు అందించనున్నట్లు మంత్రి వివరించారు. గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎఐ ద్వారా నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను తీసుకురానున్నట్లు తెలిపారు. గిరిజన యువత ఉద్యోగ్యాల కోసం కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. గిరిజన రైతులకు ఎఐఆధారిత వ్యవసాయ సలహాలు, వాతావరణ మార్పులపై ముందస్తు హెచ్చరికలు అందించనున్నట్లు తెలిపారు.గిరిజన సంక్షేమ శాఖ, ఐటి శాఖ సంయుక్తంగా 'ఎఐ ట్రైబల్ ఇన్నోవేషన్ మిషన్ ' ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.గిరిజన తండాలకు మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వివరించారు. 'ప్రతి తండాలో విద్య, ఆరోగ్యం, ఉపాధి.. ప్రతి కుటుంబంలో గౌరవ జీవితం అందించడమే ప్రభుత్వ ధ్యేయం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎం. సంతోష్ , పి ఓ భద్రాచలం రాహుల్ , ఉట్నూరు ప్రాజెక్ట్ ఆఫీసర్ మంద మకరందు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పలు శుభకార్యాలకు హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధి లోని సిరిపురం గ్రామంలోని దీదని నర్సింలు కుమారుడు రాజేందర్ కీర్తన పరిశుద్ధ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. బంట్వారం మండల పరిధిలోని సుధాకర్‌గౌడ్ పంక్షన్ హాల్లో దోరేటి రత్నం కుమారుడు సుధాకర్ స్వప్న పరిశుద్ధ వివాహ మహోత్స కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొండ బాలకృష్ణారెడ్డి పంక్షన్ హాల్లో పాస్టర్ ఎలియాజర్ కుమార్తె, మాధురి, రవణారెడ్డి పరిశుద్ధ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కుటుంబీకులు, తదితరులు పాల్గొన్నారు.




## పుస్తక పఠనం అలవరచుకోవాలి

గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవరచుకోవాలని, దీనివల్ల వారిలో సామాజిక చైతన్యం, జ్ఞాన సముపార్జన కలిగి ఉజ్వల భవిష్యత్తుకు చేరుకోగలుగుతారని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి యువతకు సూచించారు. శుక్రవారం గ్రంథాలయంలో ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా నిర్వహించిన లైబ్రరీ డే కార్యక్రమంలో డిఇఒ విజయకుమారి, ఎంఇఒ ఎన్ బాబు, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు. గ్రామ స్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహించి గ్రంథాలయాల ప్రాధాన్యతను తెలియచేస్తామన్నారు.

## డిజిపి సివి ఆనంద్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి శుక్రవారం డిజిపి కార్యాలయంలో రాష్ట్ర డిజిపి సివి ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బండి భగీరథ కేసులో బాధితురాలి వివరాల వైరల్‌పై కేసులు నమోదు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి గురించి ఆమె కుటుంబానికి సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రసారం చేస్తున్న వారిపట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకొనేందుకు సిద్ధమయ్యారు. పేట్‌బషీరాబాద్‌లో ఈ కేసు నమోదైన నాటినుండి బాధితురాలి ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాలను పలు సోషల్ మీడియాలో ఇప్పటికే ప్రసారితమయ్యాయి. ఇదే సమయంలో మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటి సైతం సీరియస్ అయి



మరింత కఠినంగా వ్యవహరించాలంటూ పోలీస్‌స్టేషన్‌లో దీన్ని సీరియస్‌గా తీసుకొన్న పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేసారు. ఈ క్రమంలో పోక్సో కేసులో బాధితురాలికి సంబంధించిన వివరాలు ప్రసారం చేయటం జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 74 మేరకు శిక్షార్హమైన నేరాలుగా పరిగణలోకి తీసుకొన్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఇప్పటికే ప్రసారం చేసిన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లాంటి పలు సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేసారు. ఇలాంటి వివరాలు, ఫొటోలు ప్రసారం చేయటంచట్ట ప్రకారం తీవ్రమైన నేరమని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. దీనివల్ల బాధిత కుటుంబాలు మానసిక వేదన గురవటంతో పాటు సమాజంలో అవమానాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ బాధిత కుటుంబాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, వివరాలను ఎవరికీ షేర్ చేయకూడదన్నారు.

## మోడీది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు...రెండు నాలుకల సర్కార్

మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మోడీ సారథ్యంలో ఉన్నది డబుల్ ఇంజన్సర్కార్ కాదు, రెండు నాలుకల సర్కార్ ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికలు ముగిసిన తర్వాత మరోలా వ్యవహరిస్తారు. నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తవగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మరో మారు మోసం చేసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి అతని అవకాశ వాద రాజకీయాలను మరోసారి బహిర్గతం చేశారు. పెట్రోల్, డీజిల్ ఆరు నెలల స్టాక్ ఉందని గొప్పలకు పోయి ఇప్పుడు మళ్లీ యుద్ధమే కారణమని చెప్పడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపీలుగా గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి ,బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు ప్రకటించారు. ఇప్పుడు ఎలా పెంచారో, ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలి. అలాగే పెట్రోల్ డీజిల్ ట్యాక్స్ లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే ప్రజలపై భారం పడదని గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, సీతక్క ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా ట్యాక్స్ లను భరించి పెరిగిన ధరలను ప్రభుత్వమే భరించాలి. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్ , డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలని మోదీ చెప్పినప్పుడే ప్రజలకు అనుమానం వచ్చింది. అధికారంలో ఉండి అడ్డగోలుగా ధరలు పెంచుతూ దేశ ప్రజల నడ్డి విరుస్తున్న ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. సమీప భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని విశ్వసిస్తున్నాను.

## కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం

అప్రమత్తమైన రైల్వే సిబ్బంది

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో తప్పిన పెనుప్రమాదం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. జైపూర్‌కు వెళ్లేందుకు నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై సిద్ధంగా ఉంచిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులోని 'బి1' ఎసి బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్టేషన్ పరిసరాల్లో తీవ్ర కలకలం రేగింది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదం సమయంలో బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. మంటలు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది వెంటనే ఇతర బోగీలను అప్రమత్తం చేసి భద్రతా చర్యలు చేపట్టారు. దీంతో స్టేషన్‌లో కొంతసేపు ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, అసలు కారణాలపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణకు ఆదేశించారు. సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

## ఇకపై యాప్ ఆధారిత జీవన నిర్ధారణతో పెన్షన్లు






**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రభుత్వం చేయూత పథకం ద్వారా అందిస్తున్న పెన్షన్ చెల్లింపుల్లో భాగంగా ఇకపై యాప్ ఆధారిత జీవన నిర్ధారణ జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మృతి చెందిన వారి పేర్లను అధికారికంగా పెన్షన్‌ల నుండి తొలగించటంతో పాటు అర్హులైన లబ్ధిదారు లందరికి పెన్షన్ అందేలా చూడటమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. దీనికోసం పంచాయతి కార్యదర్శులు గ్రామాల్లో, వార్డు అధి కారులు, బిల్ కలెక్టర్లు, పట్టణ ప్రాంతాల్లో పెన్షన్ దారుల ఇళ్లకు వెళ్లి యాప్ ద్వారా ఫేస్ రికగ్నేషన్, వేలి ముద్రల ద్వారా పెన్షన్ల అర్హతను ధృవీకరిస్తారని ఆయన తెలిపారు. శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత సిబ్బంది, అధికారులతో నిర్వహిం చిన సమావేశంలో యాప్ వినియోగం గురించి శిక్షణ ఇచ్చారు. ఈ ప్రక్రియ ఈ నెల 15న ప్రారంభమై జూన్ 15న ముగియనుం దన్నారు. యాప్ వినియోగంలో ఎక్కడైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించి మరో సారి పూర్తి చేస్తారన్నారు.

## వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టరా?

నిరసనలు చేపట్టి మెమోరాండాలు సమర్పించిన ఎఐకెఎస్ నాయకులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని వ్యవసాయ సహకార సంఘం ముందు నిరసనలు చేశారు. అనంతరం శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత, శామీర్‌పేట సోసైటి సిఇఒ రవీందర్‌కు మెమోరాండం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ ఏప్రిల్ 23, 2026న తీసుకున్న నిర్ణయం ప్రకారం 908 సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండలను నియమించాలని నిర్ణయం తీసుకుందన్నారు. దీని ప్రకారం ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యుల పేర్లను పాలక పార్టీ కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను అధ్యక్ష, డైరక్టర్ పదవిలో నామినేటెడ్ చేసుకోవడానికి అన్ని ప్రాంతాల నుంచి పేర్లను సేకరించిందని ఆరోపించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని నామినెటెడ్ వ్యవస్థకు పూర్తిస్థాయి చట్టబద్ధత లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు జరిపి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎస్‌సిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధర క్వింటాలుకు రూ. 2389 ఉండగా బి గ్రేడ్ రకానికి 2369 కాంప్రహెన్సీవ్ ప్రైస్ రూ.50, క్వింటాలుకు 3662 నిర్ణయించింది. వడ్ల తేమ శాతం 17 కన్న తక్కువ ఉంటే తీసుకుంటామని సిఇఒ తెలిపారు. రైతులకు కావాల్సిన టార్పాలిన్‌లను అందుబాటులో పెట్టాలని సూచించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ స్థానిక రైతుల సమస్యలు సాదా బైనామాలు ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు పలుమార్లు విన్నవించడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాల వలన అభివృద్ధి పేరుతో అంతాయిపల్లి రైతుల నుంచి సర్వే నెంబర్ 87లో 52 ఎకరాల 20 గుంటల భూమి ధరణిలో కోల్పోయారని ఆవేదన చెందారు. హైకోర్టు ఆర్డర్ ఉన్న ఇప్పటివరకు రైతులకు ఏలాంటి నష్టపరిహారం అందలేదని భూములను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంలో రైతులకు పాస్ పుస్తకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు భూమయ్య, కౌసల్య, హనుమాన్‌రెడ్డి, గాజుల పెంటమ్మ, జిల్లా అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు స్థానిక రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు

మున్సిపల్ కమిషనర్‌కు టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబందించిన నిధులను మంజూరు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూంకుంట మున్సిపాలిటి జిహెచ్ఎంసిలో విలీనమైన అనంతరం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని కీసర సర్కిల్‌లో కలిసిన శామీర్‌పేట డివిజన్ 300 కు సంబందించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దేవరయాంజాల్, పోతాయిపల్లి, మందాయిపల్లి, శివశివాణి కాలనీల ప్రాంతాల రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజిలకు సంబందించిన 27 పనులకు రూ. 14.25 కోట్లు ప్రతిపాదనలు సిఎం రేవంత్‌రెడ్డికి సమర్పించడం జరిగిందన్నారు. శామీర్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబందించిన శాంక్షన్ మంజూరు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి విన్నవించడం జరిగిందన్నారు. అలాగే శామీర్‌పేట డివిజన్ పరిధిలో డంపింగ్‌యార్డు సౌకర్యం లేకపోవడంతో వ్యర్థాల నిర్వాహణ, చెత్త సేకరణ సరిగా లేక అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దుర్వాసన, పారిశుద్య సమస్యల కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపధ్యంలో ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరామని తెలిపారు.

## గ్రంథాలయ సేవల్ని వినియోగించుకోవాలి

చైర్‌పర్సన్ రజిత

**ప్రజాపక్షం/పరిగి :** గ్రంథాలయ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వేంకటేష్ అన్నారు. పరిగి మున్సిపల్‌లోని శాఖ గ్రంథాలయ దినోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గోని మాట్లాడుతూ గ్రంథాలయాలని ఉపయోగించుకొని విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంపోందించు కోవచ్చునని తెలిపారు.

పట్టణంలోనిగ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథాలయ సేవ ల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సనీత, ఎంఇఒ అంజయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు కమల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయుబ్, యుసిప్, ఏజాస్, ఆరిఫ్ పటేల్, బాదం అఖిల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిహెచ్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం

*మహిళ కడుపులో దూది మరిచి కుట్లు వేసిన వైనం

* పరిస్థితి విషమం.. చేతులెత్తేసిన వైద్యులు



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణ శివారులోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో నిర్లక్ష్యంతో ఓ మహిళ పరిస్థితి విషమించింది. మహిళ కడుపులో దూది మరిచి కుట్లు వేసిన వైనంతో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. దీంతో మహిళ పరిస్థితి విషమంగా మారడంతో తిరిగి ఆసుపత్రికి తీసుకవస్తే వైద్యలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు త్వరలోనే ఆమే పరిస్థితి మెరుగుపడుతుందని ఉచిత సలహాలు ఇచ్చి పంపించారు. అయినప్పటికి ఆ మహిళ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తాండూరు నియోజకవర్గం బషీరాబాద్‌కు చెందిన ఆర్తిని కాన్పు కోసం ఈ నెల 3న మాత శిశు ఆసుపత్రిలో చేరిపించారు. సాధరణ కాన్పు జరగడంతో పండంటి శిశువుకు జన్మనిచ్చింది. కాన్పు సమయంలో ఎపిసియోటిమి చేసిన వైద్యులు ఆర్తికి కుట్లు వేయాలని చెప్పి..చికిత్స తరువాత దూదిని లోపల మరిచి పోయి అలాగానే కట్లు వేశారు వైద్యులు. ఐదురోజుల తరువాత ఆర్తిని ఆసుపత్రిని నుండి డిచార్జ్ చేశారు. ఇంటికి వెళ్లి పోయిన ఆర్తి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్య స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ ఆర్తికి లోపల కాటన్ ఉన్నట్లు గుర్తించారు. కుట్లు విప్పి బయటకు తీశారు. దీంతో ఆగ్రహించిన కటుంబ సభ్యులు ఆర్తిని తీసుకోని మాత శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అయితే వైద్యులు ఆర్తికి రెండు రోజుల్లో నయమవుతుందని నిలక్ష్యంగా సమదానం ఇచ్చారు. అయితే క్రమంగా ఆర్తి పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్య కోసం ఆర్తిని హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు చేతులెత్తేశారు. ఈ సందర్భంగా బాధితురాలు భర్త మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన బార్య పరిస్థితి విషమంగా మారిందని, బాధ్యులపై వైద్యుల చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఆర్ఎంఒ డాక్టర్ అనిల్‌ను వివరణ కోరగా కడుపులో దూది మరిచి కుట్లు వేసిన విషయం వాస్తమనేనని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుల చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కళాభిమానులకు ఆర్థికంగా సహకరించాలి

ప్రజానాట్య మండలి కళాకారుల మహాసభల కరపత్రాల ఆవిష్కరణలో కళాకారుడు ప్రవీణ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ ప్రజానాట్య మండలి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండళి కళాకారుడు ప్రవీణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం శామీర్‌పేట మండల కేంద్రంలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రవీణ్ అధ్యక్షతన డిజి సాయిలుగౌడ్ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి సభలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మే 19న నల్లమల గిరి ప్రసాద్ విజ్ఞానకేంద్రం జగద్గరిగుట్టలో మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మేడ్చల్ జిల్లాలోని ప్రతి సమస్యపై స్పందిస్తు అనేక రకాల కళారూపాలను రూపొందించి ప్రజా సమస్యలపై స్పందించి పాటల ద్వార ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలపై గళమెత్తిన పాట ప్రజలను చైతన్యవంతం చేసిందన్నారు. కళాభిమానులను ఆర్థికంగా సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని శామీర్‌పేట తహాశీల్దార్ సుచరిత హెచ్చరించారు. శుక్రవారం శామీర్‌పేట రెవెన్యూ పరిధిలోని మేరు (దర్జీ) ల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి నిర్మించుకున్న ఇళ్లను శామీర్‌పేట తహాశీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ రాఘవ ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో కూల్చివేతలు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023లో గత ప్రభుత్వం శామీర్‌పేట మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 79లో 500 గజాల భూమిని మేరు దర్జీ కులస్థుల అభివృద్ధి కోసం కేటాయించడం జరిగిందన్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఇట్టి స్థలాన్ని కబ్జా చేయడంతో మా స్థలం మాకు దక్కేలా చూడాలని ప్రజావాణి, శామీర్‌పేట తహాసీల్దార్, జిహెచ్ఎంసి కీసర సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. మా ఫిర్యాదుపై అధికారులు స్పందించి అక్రమార్కులు నుంచి మా కులస్థుల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కాపాడినందుకు మేరు (దర్జీ) కులస్థులు హర్షం వ్యక్తం చేశారు. కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను కబ్జాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రాఘవ హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/వికారాబాద్:** వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దిపక్‌తివారీ మిల్లర్లకు సూచించారు. ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని అదేశించారు. ధాన్యం రవాణా, హమాలి, నిల్వ, మిల్లింగ్‌ప్రక్రియలో ఎటువంటి అలస్యం జరగకుండా అధికారులు నిరంతరం సర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, అదనపు ఎస్‌పి రాములునాయక్ డిఆర్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో మరో అఘాయిత్యం

* మైనర్ బాలికపై కామాంధుడి అత్యాచారం
* ఫోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో మైనర్లకు రక్షణ లేకుండా పోయింది. మదమెక్కికన కామాంధులు మైనర్ బాలికలే లక్ష్యంగా అఘాయిత్యానికి ఒడిగడుతున్నారు. రెండు రోజుల క్రితం బషీరాబాద్ మండలంలో ఓ మైనర్ బాలికపై అత్యాచార ఘటన మరువక ముందే యాలాల మండల పరిధిలో మరో ఘటన వెలుగు చూసింది. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఫోన్ ఛార్జర్, నీళ్లు కావాలని వచ్చిన ఓ యువకుడు మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనపై బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాలాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన షేక్ ఫరాన్(18) అనే యుకుడు అదే గ్రామానికి చెందిన ఇంటి పక్కనే ఉండే వారింట్లో ఎవరూ లేని సమయంలో చార్జర్, నీళ్లు కావాలని ఇంట్లోకి వెళ్లాడు, ఇంట్లో ఎవరు లేకపోవడంతో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఫోక్సో కేసుతో పాటు రేప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఫోర్జరీ సంతకంతో ఇసిఐఎల్ కంపెనీ పిఎఫ్ డబ్బులు డ్రా

నిందితునికి 14 రోజులు రిమాండ్...

చర్లపల్లి జైలుకు తరలింపు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** పిఎఫ్ ఖాతా నుండి డబ్బులు ఫోర్జరీ సంతకం తో డ్రా చేసిన నిందితునికి రిమాం డ్ విధించిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం ఇసిఐఎల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఓంకార్ ఇసిఐఎల్ కంపెనీ పిఎఫ్ ఖాతా ఈ నెల 2వ తేదీన ఎస్‌బిఐ, ఏఎస్ రావు నగర్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుండి చెక్ నంబర్ 534666 ద్వారా 16 లక్షల రూపాయలు, చెక్ నంబర్ 534648 ద్వారా 12.50 లక్షలు, చెక్ నంబర్ 2297 ద్వారా 12.50 మొత్తం మోసపూరితంగా సంతకాలు ఫోర్జరీ చేసి డబ్బులు ఓంకార్ ట్రాన్స్‌ఫర్ చెసుకున్నట్లు గుర్తించారు.విచారణలో ఈ మొత్తం రాజారపు ఓం కార్ తన భార్య కాశీశ్వరి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఓంకార్‌ను విచారించగా నాలుగు చెక్కులు దొంగిలించి మూడు చెక్కులు డ్రా చేసుకున్నారని ఒక చెక్కు సంతకం పొంతన లేకపోవడంతో తిరస్కరించబడిందని, నకిలీ సంతకాలతో మోసం చేసి పొందిన మొత్తాలను తన భార్య ఖాతాల్లో జమచేసి ఇతర ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుని వద్ద నుండి 2 తులాల బంగారం, 2.5లక్షల రూపాయల నగదు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశారు. ఇసిఐఎల్ ఉద్యోగి సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించి, చర్లపల్లి జైలుకు తరలించామని వారు తెలిపారు.

